వ(క)డగండ్లు..



చక్రాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న ఎంఏఓ అనిల్‌కుమార్



మహబూబ్‌నగర్ రూరల్ మండలం రామచంద్రాపూర్ గ్రామంలో నేల రాలిన వరి పంట

- వేముల, చక్రాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న వరి
- కోత దశలో ఉన్నందున వడగండ్లకు రాలిపోయిన వడ్లు
- పంటలను పరిశీలించిన అధికారులు

ఆరుగాలం కష్టపడే అన్నదాతకు అడుగడుగునా కష్టాలు వెంటాడుతున్నాయి. మొన్నటి వరకు ఎండ తీవ్రతకు భూగర్భజలాలు అడుగంటిపోయి చేతికొచ్చే పంటలు ఎండిపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రెండు రోజులు నుంచి కురుస్తున్న వడగండ్ల వానలు, అకాల వర్షం వారి పాలిట శాపంగా మారింది. పంట కోసే సమయంలో వడగండ్లు పడటంతో పంటలు నేలరాలి అపారమైన నష్టాన్ని మిగిల్చాయి.

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులకు తీవ్ర పంట నష్టం జరిగింది. మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ, మూసాపేట మండలాల్లో కోతకు వచ్చిన వరి పంట వడగండ్ల వానతో పూర్తిగా నేలమట్టమైంది. మామిడి తోటలతో పాటు మొక్కజొన్న పంట సైతం అకాల వర్షం వల్ల రైతులు నష్టపోయినట్లు అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో అకాల వర్షాలతో 1967 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

పంట చేతికందే దశలో..

అడ్డాకుల: మూసాపేట మండలంలో పంట చేతికందే దశలో ఉన్న సమయంలో వచ్చిన వడగండ్ల వానతో గింజలు నేలరాలాయి. చక్రాపూర్, వేముల, దాసర్‌పల్లి, చెన్నంపల్లి గ్రామాల్లో వడగండ్లు పడ్డాయి. ఈ గ్రామాల్లో సుమారు 420 ఎకరాల వరకు పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, ఏఈఓ సురేష్ పరిశీలించి రైతుల వివరాలు సేకరించారు.

వర్షంతో రాలిన వరి

భూత్పూర్: మండలంలోని కర్వెన, మద్దిగట్ల, కొత్త మొల్గర గ్రామాలల్లో ఆదివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానకి చేతికొచ్చిన వరి పంట నేలపాలైంది. వారం రోజుల్లో కోతలు కోయాల్సి ఉండగా వర్షాలతో రైతులు నష్టపోయారు.

రోడ్లు మొత్తం వడగండ్లతో..

నవాబుపేట: మండలంలోని కారూర్, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. దీంతో రోడ్లపై ధాన్యం ఆరబోసినట్లు రోడ్లు మొత్తం వడగండ్లతో నిండిపోయాయి. అలాగే ఇప్పటూర్, కిషన్‌గూడ, చెన్నారెడ్డిపల్లిల్లో సైతం పాక్షికంగా వడగండ్ల వాన కురిసింది.

మామిడి తోటల రైతులు..

రాజాపూర్: మండల కేంద్రంతో పాటురాయపల్లి, ఖానాపూర్, కుచ్చర్‌కల్, బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వడగళ్ల వర్షం కురిసింది. దీంతో మామిడి తోటల, కూరగాయలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందారు.



జడ్చర్ల మండలం కిష్టారంలో గాలులకు రాలిన మామిడి పండ్లను చూపుతున్న రైతు

రాలిన మామిడి

జడ్చర్ల టౌన్: ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవటంతో మండలంలోని కిష్టారంలో గోపాల్‌రెడ్డి అనే రైతుకు సంబంధించిన మామిడి తోటలో కాయలు రాలిపడ్డాయి. పెద్ద మొత్తంలో మామిడికాయలు రాలటంతో రైతు ఆందోళన వ్యక్తం చేశాడు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలో అకాల వర్షాలుతో వరి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వమే ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని బొక్కలోనిపల్లి, రామచంద్రాపూర్, ధర్మాపూర్ గ్రామాల్లో వడగళ్ల వానకు దెబ్బతిన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. వడగండ్ల వాన కురవడంతో రైతులకు తీవ్ర నష్టం కలిగిందన్నారు. నాయకులు బొంగు గంగన్న, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్‌కుమార్, జాం శ్రీనివాసులు, రాజుగౌడ్, శశిధర్‌రెడ్డి, మహేష్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, సుబ్రమణ్యం, పి.యాదయ్య ఉన్నారు.

ప్రతి ఎకరాకు రూ.40 వేలు పరిహారమివ్వాలి: శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: అకాల వర్షం.. వడగండ్ల ధాటికి వరి పంట నష్టపోయిన ప్రతి రైతుకు రూ. 40 వేల చొప్పున పరిహారమివ్వాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని బొక్కలోనిపల్లి, రామచంద్రాపూర్, తెలుగుగూడెం, జమిస్తాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నానని.. వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయినట్లు మహిళా రైతు జ్యోతి కంటతడి పెట్టుకుంది. ఆమెకు మాజీ మంత్రి ఆర్థిక సహాయం అందించారు. వ్యవసాయ అధికారులకు ఫోన్ చేస్తే సెలవులో ఉన్నామని చెప్తున్నారని, ఎవరు రాలేదని రైతులు ఆయన దృష్టికి తీసుకురాగా.. వ్యవసాయ అధికారులకు ఫోన్ చేసి వెంటనే క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టంపై అంచనాలు వేయాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ల దృష్టికి సమస్య తీసుకెళ్తానని, ప్రభుత్వం ఆదుకోకుంటే రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం చేస్తానని అన్నారు.



బొక్కలోనిపల్లిలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు తమ గోడు వెల్లబోసుకుంటున్న రైతు జ్యోతి దంపతులు

అప్పులు ఎలా తీర్చాలో..

మాకున్న ఎకరన్న పొలంతో పాటు మరో ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగుచేశా. వారం రోజుల్లో కోత కోయాల్సి ఉంది. శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన పడడంతో వరి కంకికి గింజ లేకుండా మొత్తం నేలరాలింది. వడగళ్లు కురిసే సమయంలో నేను, నా భర్త అక్కడే ఉన్నా.. ఏమీ చేయలేక ఉండిపోయాం. ఎకరానికి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టాం. ఈ వానతో గింజ చేతికొచ్చే పరిస్థితి లేదు. పెట్టుబడికి తీసుకొచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

– జంగం జ్యోతి, బొక్కలోనిపల్లి

రైతుల వివరాలు సేకరిస్తాం

అకాలవర్షాల కారణంగా జిల్లాలో 1967 ఎకరాలలో వరిపంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశాం. సోమవారం నుంచి ఏఈఓలతో కలిసి క్షేత్ర స్థాయిలో సర్వేచేసి నష్టానికి సంబంధించిన నివేదిక సిద్ధంచేస్తాం. సర్వే పూర్తయ్యాక కలెక్టర్‌ద్వారా ప్రభుత్వానికి నష్టపోయిన రైతుల వివరాలు పంపిస్తాం.

– బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి, మహబూబ్‌నగర్

90 శాతం రాలిపోయాయి



15 ఎకరాల్లో వరి పంట వేశా. దాదాపు రూ.4.50 లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి 90శాతం గింజలు నేల రాలిపోయాయి. ఇప్పుడు ఉన్న పంటను కోత మిషన్‌తో కోయిస్తే దాని ఖర్చు కూడా వస్తుందో లేదో తెలియదు.

– లక్ష్మారెడ్డి, రైతు, చక్రాపూర్ గ్రామం, మూసాపేట మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



ఐదు ఎకరాల్లో వరి పంట వేశా. వడగండ్లకు చేనులో సగానికి పైగా గింజలు రాలి పడ్డాయి. పంట చేతికొచ్చే దశలో నష్టం వాటిల్లింది. ఇంత నష్టం జరుగుతుందని ఊహించలేదు. పంటలు దెబ్బతిన్న మాలాంటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

–కావలి బుచ్చన్న రైతు, వేముల గ్రామం, మూసాపేట మండలం

క్లుప్తంగా

స్నేహితుడికి ఆర్థికసాయం



కోయిల్‌కొండ: మండలంలోని లింగుపల్లికి చెందిన బాబు కొద్దిరోజుల క్రితం విద్యుత్ ప్రమాదానికి గురయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని 2003–2004 బ్యాచ్ పదో తరగతి పూర్వపు విద్యార్థులు స్నేహితుడు బాబును పరామర్శించి రూ. 63,400 ఆర్థికసాయం అందించారు. త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం



జడ్చర్ల టౌన్: మండలంలోని పోచమ్మగడ్డతండాలో ఎంపీ డీకే అరుణ నిధులతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపట్టిన సీసీ రోడ్డు పనులకు బీజేపీ అధికారప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ ఆదివారం పూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఎంపీ డీకే అరుణ భారీగా నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. పనులు త్వరితగతిన, నాణ్యతగా పూర్తిచేయాలని సూచించారు.

కేజీబీవీలో విచారణ



రాజాపూర్: స్థానిక కేజీబీవీలో ఆదివారం అధికారులు విద్యార్థినులతో విచారణ జరిపారు. శుక్రవారం పాఠశాలలో వైష్ణవి అనే 8వ తరగతి విద్యార్థిని మల్టీవిటమీన్ మాత్రలు మింగిన విషయం పత్రికల్లో వచ్చింది. సీఎంఓ బాలు యాదవ్, రాజాపూర్, జడ్చర్ల మండలాల తహసీల్దార్లు విద్యాసాగర్‌రెడ్డి, నర్సింగ్‌రావ్, జీసీడీఓ రాధ, ప్లానింగ్ అధికారి సంపత్, ఎంఈఓ సుధాకర్ విద్యార్థినులతో ఈ విషయంపై ఆరా తీశారు. వైష్ణవి స్నాక్స్ అనుమతి లేకుండా తీసుకోవడంతో 9వ తరగతి సీనియర్ విద్యార్థినులు ప్రశ్నించడంతో పాటు ఒక అమ్మాయి చేయిచేసుకుంది. క్షణికావేశంలో మాత్రలు మింగిన విషయాన్ని వైష్ణవి అధికారులకు తెలిపింది. కొన్ని రోజులుగా కేజీబీవీలో చోటుచేసుకున్న విషయాలపై కలెక్టర్ విజయేందిర బోయికి నివేదిక అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

సంతలో అన్నదానం

నవాబుపేట: సంతకు వచ్చిన వారి కోసం నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమం ఎనిమిది నెలలుగా కొనసాగుతోంది. ప్రతి ఆదివారం 500 మందికి తగ్గకుండా సంతకు వచ్చే వారు భోజనం చేస్తారు. మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి 30వారాలుగా ఈ కార్యక్రమం నిరాటంకంగా నిర్వహిస్తు వస్తున్నారు. సంతకు వచ్చిన ప్రజలు తమ పనులు చూసుకొని ఉచిత భోజనం చేసి సాయంత్రం తమ ఊర్లకు వెళ్తారు. కార్యక్రమంలో సుధాకర్‌చారి, పుట్టి అంజనేయులు, మహేష్, శర్మ, నిరంజన్, నసీర్, వెంకటయ్య పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఆల్‌మేవా జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్‌పీ.వెంకటేశ్, మహ్మద్ అయూబ్, అబ్దుల్ ఖాదర్, ఎండీ.రోషన్, డాక్టర్ షేక్ ఫరీద్, మదన్ మోహన్ యాదవ్, సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, వెంకట్ నారాయణ, బాలయ్య యాదవ్, కిష్టయ్య, ఖలీల్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'రాజకీయ చైతన్యం రావాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పద్మశాలీల్లో రాజకీయ చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం గాజులపేట లోని ఓ ఫంక్షన్ హాలులో ఉమ్మడి పాలమూరు జిల్లా పద్మశాలి సంఘం కార్యనిర్వాహక సభ్యుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ కార్యదర్శిగా డా.పానుగంటి బాలరాజుతో ప్రమాణ స్వీకారం చేయించారు. మురళి, రామచంద్రరావు, పల్లాటి బాలరాజు, కొక్కుల దేవేందర్, వనం దుశ్యంతల, అవ్వారి భాస్కర్, మెతుకు సత్యం, బొమ్మ రఘురాం పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



రైతులకు స్పింకర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దమగ్నాపురంలో ఆదివారం పలువురు రైతులకు సబ్సిడీ స్పింకర్లను అందజేశారు. అనంతరం కౌకుంట్ల మండలం తిర్మలాపురంలో పేదలకు అందించిన ఇందిరమ్మ ఇళ్లకు, సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రభుత్వం చేపడుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను విస్మరించిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు అండగా ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అరవింద్‌కుమార్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కురుమూర్తి స్వామి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ చైర్మన్ కథలప్ప, నాయకులు రామోహన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అడ్డాకుల: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శెట్టిశేఖర్, బాలనర్సిములు, బగ్గి కృష్ణయ్య, కృష్ణయ్య, నిరంజన్, సురేష్, రాంచందర్, ఎన్‌టీ గౌడ్, నారాయణ, మహేందర్, తాజోద్దీన్, షేక్‌పాష, సలాం, కలీల్ తదితరులు ఉన్నారు.

కందూర్ క్షేత్రం.. భక్తజన సంద్రం

- శివలింగానికి అభిషేకాలు
- జాతరలో వెలసిన దుకాణాలు
- ఊపందుకున్న కొత్తకుండల కొనుగోళ్లు

అడ్డాకుల: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన కందూర్ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జాతర వైభవంగా సాగుతోంది. ఆదివారం సెలవు కావడంతో పాటు ఉగాది పండుగ సమీపించడంతో జాతరకు భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కోనేరులో స్నానాలు చేసి ప్రధాన ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు చేశారు. స్వామి దర్శనం కోసం భక్తులు ఆలయ ఆవరణలో బారులు తీరారు. ఆలయ పరిసరాల్లోని దుకాణాలు భక్తులతో కిటకిటలాడాయి. కందూరుకు వెళితే కాశీకి వెళ్లినంత పుణ్యం వస్తుందనే భావనలో భక్తులు ఆలయ కోనేరు ఆవరణలో ఉన్న కల్పవృక్షాల కింద భోజనాలు చేసి సేద తీరారు. గాజుల, మిఠాయి దుకాణాలు, చిన్న పిల్లల ఆట వస్తువుల దుకాణాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ఉగాది పండగ సమీపించడంతో జాతరలో కొత్త కుండల కొనుగోళ్లు ఊపందుకున్నాయి.



శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

చలివేంద్రం ప్రారంభం

జాతరకు వచ్చే భక్తులకు తాగునీటిని అందించాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించడంతో గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శ్యామలమ్మ కుమారుడు, దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ రమేష్‌గౌడ్ ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. తోకల శ్రీనివాస్‌రెడ్డి, చల్మారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, చెన్నయ్య యాదవ్, తిరుపతయ్య యాదవ్, రాములు యాదవ్, సాంబశివుడు, మేస్త్రీ లక్ష్మయ్య ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బంగారు మైసమ్మ బోనాలు

రాజాపూర్: మండలంలోని తిర్మలాపూర్‌లో ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో బంగారు మైసమ్మ బోనాలను నిర్వహించుకున్నారు. మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకుని గ్రామంలోని పురవీధులగుండా ఊరేగింపుగా వెళ్లారు. గ్రామశివారులో ఉన్న ఆలయంలో చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. రైతులు తమ ఎడ్ల బండ్లను, ట్రాక్టర్లను సుందరంగా అలంకరించి ఆలయం చుట్టూ ఊరేగించారు.

నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగేష్

నవాబుపేట: నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన నాగేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్ నియామకపత్రాన్ని నాగేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడుతూ అధ్యక్ష పదవి రావడం మరింత బాధ్యత పెంచిందన్నారు. నూతన సభ్యులను పాలమూర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి రామకృష్ణ, సభ్యులు పాతూరు రవి, సత్యం, బుచ్చిబాబు, వెంకట్, నారాయణ, సాంబయ్య,రాములు, నర్సింహులు, శంకర్ పాల్గొన్నారు.

దేవాలయానికి రూ.లక్ష విరాళం

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయాల పునర్నిర్మాణ పనుల కోసం దేవరకద్ర మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ కుటుంబ సభ్యులు రూ. 1లక్ష విరాళంగా ఇచ్చారు. దేవరకద్ర మాజీ సర్పంచ్ దివంగత అరుణాచలం రాజు, వారి తల్లిదండ్రులు దివంగత అరుణాచలం, శ్యామలమ్మల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పార్వతి, నవీన్, రఘువరన్, బాలాజీలు విరాళం దేవాలయ పూజారులకు అందజేశారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

- మంత్రితో మాట్లాడి రైతులకు పరిహారమిప్పిస్తా
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



బొక్కలోనిపల్లిలో వానకు దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: అకాల వర్షాలు, వడగండ్ల వానకు జరిగిన పంట నష్టానికి అధైర్య పడొద్దని, రైతులకు అండగా ఉండి ఆదుకుంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం మండలంలోని చౌదర్‌పల్లి, జమిస్తాపూర్, బొక్కలోనిపల్లి, రామచంద్రాపూర్ గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. మొత్తం 1520 ఎకరాలలో పంట నష్టం జరిగిందని, పంట చేతికొచ్చే సమయంలో రైతులు నష్టపోవడం బాధాకరమన్నారు. పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వ్యవసాయశాఖ మంత్రితో మాట్లాడి పంట నష్ట పరిహారాన్ని ఇప్పిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, తహసీల్దార్ సుందర్‌రాజ్, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఏఓ శృతి, మాజీ సర్పంచ్ గోవింద్‌యాదవ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి ఉన్నారు.

మహబూబ్‌నగర్ ప్రతిష్టను..

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ ప్రతిష్టను మరింతగా పెంచుదామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక షాలీమార్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ముస్లింలకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇఫ్తారు ఏర్పాటు చేశారు. ప్రత్యేక దువా అనంతరం ఆయన ముస్లింలకు ఖజూర్, పండ్లు తినిపించారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, లక్ష్మణ్ యాదవ్, మల్లు నర్సింహారెడ్డి, బెక్కరి అనిత, ఆనంద్‌గౌడ్, ఎస్‌పీ.వెంకటేశ్, సంజీవ్ ముదిరాజ్, చంద్రకుమార్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రీ, బెక్కరి మధసూదన్‌రెడ్డి, ఫయాజ్, అజ్మత్‌అలీ, అవేజ్ పాల్గొన్నారు.

రంజాన్ పండుగను..

రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన యూబీ గార్డెన్స్‌యజమాని ఒబేదుల్లా షరీఫ్ పేద ముస్లింలకు అందించే రంజాత్ గిఫ్ట్ పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.

పగిలిన 'భగీరథ' పైప్‌లైన్

- వృథాగా పారిన నీళ్లు
- మురుగు నీళ్లు కలవడంతో భరించలేని దుర్వాసన
- వైఎస్సార్ సర్కిల్ మడుగులా నిలిచిన నీరు
- మరమ్మతులు చేపట్టిన అధికారులు

జడ్చర్ల టౌన్: 44వ నంబర్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ ఆదివారం తెల్లవారుజామున పగిలింది. దీంతో నీరు వృథాగా పారింది. పైప్‌లైన్ పగిలిన చోటనుంచి జాతీయ రహదారి సర్వీస్‌రోడ్డు వెంట పారుతూ వైఎస్సార్ సర్కిల్ వద్ద నీళ్లు మడుగులా నిలిచాయి. అక్కడి నుంచి ఫ్లైఓవర్ కిందుగా పోలీస్‌స్టేషన్ ముందు నుంచి చింతచెట్ల వరకు వరదలా పారాయి. నీళ్లు ఎక్కడినుంచి వస్తున్నాయో తెలియక స్థానికులు కొంతసేపు అయోమయానికి గురయ్యారు. పైప్‌లైన్ పగిలినచోటే మురికినీరు లీకేజి అవుతున్నాయి. దీంతో పైప్‌లైన్‌లోని నీటికి మురికినీరు కలవటంతో రోడ్డు పొడుగునా దుర్వాసన వెదజల్లింది. ప్రయాణికులు, పాదచారులు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వచ్చింది. పైప్‌లైన్ పగిలిన విషయాన్ని గుర్తించిన మిషన్ భగీరథ అధికారులు నీటి సరఫరా నిలిపివేసి మరమ్మతు చర్యలు చేపట్టారు.



పైప్‌లైన్ పగిలిన చోట చేపడుతున్న మరమ్మతు

అభివృద్ధి పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఐదో డివిజన్ పరిధిలోని శ్రీవిద్యానగర్ కాలనీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం రాత్రి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. మాజీ కౌన్సిలర్ కె.వనజ, కాలనీవాసులు పురుషోత్తం గౌడ్, భీంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జ్యోతి, రమేష్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



యువతకు ఆదర్శం.. భగత్ సింగ్



మహబూబ్‌నగర్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: యువతకు ఆదర్శం భగత్‌సింగ్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం భగత్‌సింగ్ 94వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

- మహబూబ్‌నగర్‌లోని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకొని క్లాక్‌టవర్ నుంచి బస్టాండు మీదుగా న్యూటౌన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంవీఎస్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటయ్య, సుశృత ప్రజా వైద్యశాల ఎండీ డా.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. ఏబీవీపీ పీయూ శాఖ అధ్యక్షుడు నాగేష్ ఆధ్వర్యంలో పీయూలోని పీజీ కళాశాల ఎదుట భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటం వద్ద నివాళులర్పించారు.
- హన్వాడ మండలంలో ప్రజాసంఘాల నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మయ్య, కుర్మయ్య, జంబులయ్య, సలీం, రాములు పాల్గొన్నారు.
- మహమ్మదాబాద్ మండల కేంద్రంలో భగత్ సింగ విగ్రహానికి రైతుసంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కురుమయ్య, బాలకృష్ణ, రాములు, వెంకటయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.
- జడ్చర్లలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయరాములు, జంగయ్య, యాదయ్య, సాయిలు,రమేష్ పాల్గొన్నారు.



మహమ్మదాబాద్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు